# అంధకారంలో ఆశ్రయం

పది సంవత్సరాల తరువాత - తటాలున, ఉన్నపాటుగా - కొంత సేపు ముందు చెన్నపట్టణం వీధుల సందడిలో యువతులు రుక్కు, పట్టు కలుసుకున్నారు; తరువాత ఇద్దరూ ఈ హోటల్ కి వచ్చారు. కాఫీ తాగడానికీ, మనసు విప్పి మాట్లాడడానికి ఒప్పైన జాగా ఇది.

జీవిత సంధిలో ఇద్దరు యువతులు కలుసుకోవడం ఎంత సాధారణమైన సంగతో అలాగే వాళ్ళూ ఇద్దరూ కలుసుకొని విడిపోవటం కూడ.

ఈ పది సంవత్సరాలలో ఇద్దరికీ చాలా కొత్త కొత్త స్నేహితులు దొరికుంటారు; వాళ్ళ జీవితాల్లో కూడా ఎన్నో మార్పులు ఏర్పడి ఉంటాయి. ఈ ఎడబాటు వలన వాళ్ళ స్నేహంలోని పాత జ్ఞాపకాలు కొంచం కొంచంగా వెలిసిపోయి - ఇక కొత్త అనుభవాలూ, పరిచయాలూ మూలంగా అంతరాత్మలో ఎక్కడో పాతుకుపోయినవి ఇప్పుడే గభీమని - వాళ్ళు ఇద్దరూ హెచ్చరిక లేకుండా కలుసుకోడంతో - బయటకు వచ్చేసాయి; వాళ్ళు ఇందకు ముందు చూసి ఎరుగని ఎందరో మనుషులు - వందలు వందలుగా - జన సముద్రంలో యంత్రాలు లాగ మెలుగుతుంటే ఇప్పుడు



యదేచ్ఛగా ఢీ కొని ఇద్దరూ తమ్మల్ని ముఖాముఖిగా చూసుకున్నారు.

యంత్ర యుగంలో చిక్కుకున్న కారణం వలన మనుషులు కూడా యంత్రాలుగా మారిపోతారా ఏమిటి?

ఆ చూపుల కలుపునుండి తప్పించుకున్నట్టు, తనకే తెలియక, పట్టు మొహం తిప్పుకొని, ఒక అర నిమిషంలో తన్ను సర్దుకొని, సంతోషంగా మనసు మార్చుకుంది. అదే ఆమెకు వీలయింది. తను అలా జంకుపడినందుకు ఆమె తనలో బాధపడింది కూడా.

ఐతే రుక్కు దాన్ని సంతోషంలో ఏర్పడిన ఆశ్చర్యమని అని అర్థం చేసుకుంది; ఆ నిమిషం అదే నిజం . . .

మాటలేమీ రాక, ఇద్దరూ, ప్రేమతో ఒకరినొకరు చేతులు పట్టుకున్నారు.

' పట్టూ ' , ' రుక్కూ ', అని మౌనంగా వాళ్ళు పేరులు పరివర్తన చేసుకుంటూంటే ఇద్దరి మొహాల్లో నవ్వూ, ఆనందం కనిపించాయి; చేతులు రెండూ బిగువుగా కలుసుకున్నాయి.

కొంత సమయం ముందు ఆ ప్రజల గుంపునుంచి బయటకు వచ్చి ఒక్కరినొకరు పరిచయం చేసుకున్నట్లు ఏవో కొన్ని మాటలు చెప్పుకొని. తమ ఇద్దరికి ప్రస్తుతం ఎటువంటి తొందర లేదని తెలుసుకొని, వసతిగా మాట్లాడుకొవాలని, వాళ్ళు ఈ హోటల్ కి వచ్చారు.

ఆ హోటలు ప్రత్యేక గదిలో ఒకరి ఎదుట ఒకరు కూర్చొని నిదానంగా ఒక్కరినొక్కరు పరిచూసుకున్నారు. ఆ గదిలో ఉన్న ఒక పెద్ద అద్దంలో తమ తమ మొహాల్ని సరిపోల్చుకున్నారు.

ఇద్దరూ గభీమని ఒకేసారి పెద్దగా నవ్వారు; ఆ నవ్వులు ిన తరువాత ఇద్దరి మొహాల్లో గూఢమైన శౌకమే మిగిలింది.

వాళ్ళిద్దరిలో ఆహ్లాదకరమైన మార్పులు ఏమీ లేవు; రుక్కు మెడ - చీర ొన బా ా లా ి మూసిన చోట - బోసి ా ఉంది. పట్టు మెడలో సొ ్సైన ాసి చవుకైన ఒక ముత్యాల హారం; రుక్కు నుదుటమీద ఒక పెద్ద గుండ్రమైన కుంకుమ బొట్టు; పట్టు నుదుటమీద ఒక ఎఱ్ఱని తిలకం. ఇద్దరూ వాయిల్ చీరలే కట్టుకున్నారు, కాని వాటిని ధరించడంలో ఎంత భేదం! వెలసిపోయిన తన నీలి రంగు చీరతో తన దేహాన్ని కప్పుకున్న రుక్కు నడుములో దోచుకొని ఉన్న చీర కొనని తీసి మెడా, తన జుత్తు కింద ఉన్న చెమటని తుడుచుకొన్న తరువాత తన చేతిలో చుట్టబడి ఉన్న ఒక కాగితాన్ని టేబులుమీద పెట్టి తలకి మీద తిరుగుతున్న ఎలెక్ట్రిక్ ఫేను గాలిని అనుభవించింది. ఆమె మొహం నిర్మలంగా, తెల్లగా, కాని కాంతిలేకుండా ఉంది.

పట్టు మొహంలో పూసిన పౌడరు చెమటవలన మొహమంతా వాపులు కనిపించాయి. ఆమె కట్టుకున్న ఆ నల్ల చీరలో వెండి పువ్వులు ప్రకాశించాయి. పట్టు జుత్తు చూస్తే రుక్కులాగ తీరుగా



లేదు; చింపిరి జుత్తుని ఇలాగా అలాగా దువ్వినట్టుంది. చెవుల దగ్గర మాత్రం జుత్తు జాగ్రత్తగా చక్కదిద్దినట్లుంది. మెడలోనుంచి బాగా కిందకు దిగిన చోళీ; పొట్టా, భుజాలూ బయటకి తెలిసినట్లు చీరకట్టు; ఇవే ఇద్దరికీ భేదాలు.

ఐతే వాళ్ళ మొహాల్లో ఎటువంటి శో ్ం ఉన్నా ఇద్దరికీ మారని బంగారంలాంటి దేహం; ఇరవై ఐదు సంవత్సరాలలో మెరిసే మొహం; ప్ర ాశించే ్న్నులు; చుట్టలు చుట్టలుగా జుత్తు - ఇవే ఇద్దరికీ పోలి ్లు.

పట్టుకి అందమిచ్చేది ఆమె దీర్ఘమైన గడ్డం; ఒయ్యారమైన, ఎదిగిన ఆకారం.

రు ్క ి ారాని ి తగినట్టు తీర్చిదిద్దిన పెదిమలు. ఆకర్షించే నవ్వు; ఒక శిల్పం లాంటి ఆకృతి; ఒక పితంతువులో కనిపించే సరళత.

మాట్లాడడానికి ఎన్నో సంగతులు ఉన్నాకూడా, ఏమిటి మాట్లాడదాం అనే భ్రమతో మౌనంగా ఇద్దరూ ఒక్కరినొక్కరు పరిశీలుంచు ్ంటున్నారు.

రుక్కు ప్రేమతో సంభాషణ ఆరంభించింది: "నీ అమ్మమ్మ . . ?" అని ఆమె లాగగానే, పట్టు, రెండు భుజాల్ని పైకెత్తి పెదిమలు ఇరుకించింది: "రెండు సంవత్సరాలు ఐపోయాయి."

"ఐతే నువ్వు ఇప్పుడు ఇక్కడ ఒంటరిగానే ఉంటున్నావా? నువ్వు ఎప్పుడు, ఎవరితో పట్నం వచ్చావ్?" అని చెకచెకగా రుక్కు అడిగింది.

" అమ్మమ్మ పోయిన తరువాత అక్కడ ఊరులో ఎవరున్నారు నాకు? నీకు తెలుసు కదా ఆ బోధి చెట్టు అమ్మగారు . . ఆపిడ నన్ను వాళ్ళ ఇంట్లో ఉండమన్నారు . . ఒకరితో చాలా ఇంపుగా మాట్లాడి వాళ్ళదగ్గర చెమట కార్చినట్టు పని చేయించుకోడంలో ఆమెకు ఆమే సాటి. ఐతే ఏం అని నేను ఉన్నాను . . రెండు పూట్లా తిండికీ, బట్టలకీ ఏం కొరత లేదు . . సరే, గౌరవంగా ఇక్కడే ఉండిపోదాం అనుకున్నాను . . కాని వాళ్ళు తల్లడిల్లి పోయారు. ఇంటి యజమానుడు ఎవరికో జామీను కోసం సంతకం పెట్టి వాడు మోసం చేసేడాట . . అంతా పోయింది . . అప్పుడే ఆపిడ బంధువులు ఎవరో వచ్చి " ఈ అమ్మాయిని మాతో పంపించండి, సినెమాలో చేర్పిస్తాం . ." అని అన్నారు . . ఐతే అదేం కుదరలేదు . . నేను ఇప్పుడు ఒక స్నేహితురాలుతో ఒంటరిగా ఉంటున్నాను . "

పట్టు మాటలు వింటే ఆమె ఎవరిపైనో నేరారోపణ చేస్తున్నట్లుంది.

మె మాటలూ, జంకూ చూసి పట్టు అబద్ధం చెప్తుందని రుక్కుకి బోధపడింది.

"ఇప్పుడు నువ్వు ఎవరితోనో ఉంటున్నావే . . ఎవరా స్నేహితురాలు?"



" నీకు ఆమె ఎవరో తెలియదు . ." అని ఖరారుగా, 'దాన్ని గురించి నీకెందుకు? ' అన్నట్టు పట్టు జవాబు చెప్పింది.

' ఏమో ఈ పది సంవత్సరాలలో నాకు తెలియని - ఐతే నాకంటే అన్యోన్యమైన - స్నేహితులు ఈమెకు ఏర్పడియుండవచ్చు! సరే, పరవాలేదు. ఆమెకికూడా నాగురించి తెలుసుకోవాలని ఉండదా? నేను ఆమెగురించి అడుగుతున్నాను, ఆమెకు నన్ను కలుసుకోవడంలో సంతోషం లేదా? ' అని రుక్కు లోచిస్తున్నప్పుడు " మీ నాన్నగారికి ఆరోగ్యం ఎలా ఉంది? ఆయన చికిత్సకోసమే కదా మీ ఇద్దరూ ఊరు వదలి ఇక్కడ ఒక బంధువుల ఇంటికి వచ్చేరు? " అని పట్టు అడగగానే తన్ను ఇంత జ్ఞాపకం పెట్టుకొని అడుగుతున్న పట్టుని ఇంత త్వరలో తను అపార్థం చేసుకున్నందుకు రుక్కు బాధ పడింది. కాని ఆ క్షణమే పట్టు మొహంలోని చిరునవ్వు చూసి రుక్కు ఆలోచించింది: " ఈమె ఎందుకు ఇలాగ తికమకలాడుతోంది? ఎందుకు ఆమె మొహంలో ఈ పిరుద్ధ భావాలు?"

కాని పట్టు అడిగిన ప్రశ్నకి బదులు చెప్పింది రుక్కు:

" . . . అప్పుడే - మేం వచ్చిన కొన్ని రోజుల్లోనే మా నాన్నగారు పోయారు . . "

అప్పుడు హోటల్ సర్వరు గది తలుపు మీద తల ఎత్తి వాళ్ళని చూసి లోపలికి వచ్చాడు.

"ఏమిటి ఆర్డర్ చేద్దాం?" అని రుక్కు అడిగింది.

"కాఫీ చాలు . ."

"బాగా చెప్పావ్ . .ఇన్ని రోజులు తరువాత కలుసుకున్నాం . ." అని సల్లాపంగా నవ్వుతూ " రెండు స్పెషల్ స్వీట్స్ తీసుకు రండి" అని సర్వర్కి చెప్పింది.

రుక్కు సర్వరు తో మాట్లాడుతున్నప్పుడు ఆ స్వల్ప కాలంలో పట్టు తనలో ఏదో ఆలోచిస్తూ తల వంచింది. సర్వరు వెళ్ళినతరువాత రుక్కు ఆమె స్థితిని అర్థం చేసుకోలేక ఆమెను తిరిగి చూసింది.

గభీమని పట్టు తల ఎత్తింది. రుక్కును చూసి మళ్ళీ ఒక చిరు నవ్వు నవ్వి, కళ్లబొల్లి ప్రకాశంతో " సరే, నువ్వు ఇప్పుడు . . అదే బంధువుల ఇంట్లో ఉంటున్నావా? " అని అడిగింది.

" అవును, ఆ ఇంట్లోనే ఉన్నాను, కాని ఒంటరిగా ఉంటున్నాను."

"ఒంటరిగానా? అంటే నువ్వేం పని చేస్తున్నావా?" అని అడుగుతూ రుక్కు చేతులకు దగ్గరగా ఆ టేబులు మీద ఉన్న ఆ పొడుగాటి కాగితాన్ని తీసుకొని, " ఇది నేను చూడవచ్చునా?" అని అడిగింది పట్టు.

సరే అని తల ఊపుతూ రుక్కు పట్టుని పరిశీలుస్తున్నట్లు తీక్షణంగా చూసింది.



అప్పుడు సర్వరు లోపలికి వచ్చి వాళ్ళకి స్వీట్స్ పంచాడు; కాఫీ, స్నేక్స్ తెమ్మని చెప్పి రుక్కు అతనికి చెప్పి పంపింది.

ఆ కాగితాన్ని విప్పి చూసిన పట్టు జుగుప్సతో కలవరపడి చేతిలో పరిచిన ఆ కాగితానికి పైగా తల ఎత్తి రుక్కుని చూసింది.

రుక్కు నిమ్మళంగా నవ్వింది.

ఇంతలో ఎవరో వస్తున్నారని సందడి వినగానే పట్టు మళ్ళీ తొందర తొందరగా ఆ కాగితాన్ని చుట్టసాగింది. దాన్ని సగం చుట్టేసరికి ఆమె దొంగలాగ చూస్తుంటే ఆ సర్వరు తను తీసుకొచ్చిన తినుబండార్ని పెట్టి వెళ్ళాడు.

అతని తల మాయమవగానే పట్టు గప్పుమని అడిగింది: "ఏమిటే ఈ అసహ్యం?"

రుక్కు ఆమెను చూసి, దయతో, నవ్వుతూ చెప్పింది: " ఇది అసహ్యమంటే నువ్వూ, నేనూ - ఈ ప్రపంచమే అసహ్యం అన్న మాట . . బాగా చూడు . . నీకెందుకు దాన్ని చూడడానికే భయం? .నిష్కపటమైన మనసుతో చూడు . . "

పట్టు మళ్ళీ కన్నులు చిట్లించుకొని ఆ కాగితాన్ని పరచి చూసింది.

అందులో - వివస్త్రగా - ఒక వైపు ఆనుకొని మోకరిల్లే ఒక స్త్రీ ఆకారం కనిపిస్తోంది.

మొట్టమొదట చూసినప్పుడు అలవాటు లేని కళ్ళకి ఆ చిత్రం కలుషితమైన మనసుకి ఛీ అనిపించింది. కాని అదే చిత్రాన్ని ఇప్పుడు ఓపికతో చూసినప్పుడు - కూర్చున్న ఆ యువతి భంగిమ; ఎడమ పక్క మోకరిల్లే ఆ పొడుగాటి కాళ్ళ తీరు; ఆ నడుము వంపు; కుడి చేతిని కింద ఆనుకొని, మెడను కుడి పక్కగా తిప్పి మొహాన్ని భుజం మీద ముంచుకొనే తల; పొట్ట, ఛాతీ, వక్ష స్థలంలో కనబడే మడతలూ, వాటి తారుణ్యమూ; ఇక చిత్రంలో ఈ విభేదాలని నొక్కి చూపించే రేఖళూ, నీడలూ - ఇవన్నీ చూస్తుంటే ఆ చిత్రంలోని నిపుణత, అందాలతోపాటు ఆ చిత్రంలో ఉండే యువతి రుక్కువే అని పట్టుకి బోధపడింది. పట్టు రెండు సార్లు ఆ చిత్రంలోని మొహాన్ని రుక్కు మొహంతో సరిపోల్చింది.

" ఇది నువ్వే కదూ? " అనే పట్టు ప్రశ్నకి రుక్కు మనస్పూర తృప్తితో తల ఊపింది.

" దీన్ని చిత్రించినది ఎవరు - ఒక మగవాడా లేక ఆడదా?"

రుక్కు మెల్లిగా నవ్వింది. "ఇది చిత్రించినది ఒక ఆర్టిస్టు! అలాగ చెప్తే నీకు తృప్తి ఏర్పడుతుందా? " అని మళ్ళీ నవ్వి, " అది ఒక మగవాడే" అని చెప్పింది.

"దీనికోసం నీకు డబ్బు ఇస్తాడా?"

" ఆ . . ఇస్తారు . . నేను ఏం పని చేస్తున్నాను అని నువ్వు అడిగావుగా? నా ఉద్యోగం ఇదే . ." అని చెప్పిన రుక్కుని పట్టు



దీర్ఘంగా చూసింది. రుక్కు వీపు వెనుకన కనబడే అద్దంలో తన ఆకారాన్నికూడా చూసింది. " నా కంటే మంచి గుణమూ, సరళత ఉన్న రుక్కు - తన మెడనీ, వీపునీ బయటకి వెళ్ళేటప్పుడు బాగా మూసుకునే రుక్కు - ఇప్పుడు తన పొట్ట నింపడానికోసం పరాయి మగవాడి ముందు వివస్త్రగా పని చేస్తుందే . ." అన్న తలపులో పట్టు కళ్ళలో నీళ్ళు నిండాయి.

" అవును . . మరి నీవేం పని చేస్తున్నావ్? ఆ నీ స్నేహితురాలు ఏమి ఉద్యోగం చేస్తోంది?" అని రుక్కు అడగగానే పట్టుకి దుఃఖం అలాగే కంఠ నాళంవరకూ వచ్చేసింది; పెదిమలు కంపించుకొని ఏడవాలనిపించింది.

ప్రారంభంలో - తెలుసుకున్న వెంటనే - తనలాగ కాకుండా రుక్కు గౌరవమైన పని చేస్తూ జీవిస్తుందని పట్టు ఆమెదగ్గర తన గురించి వ్యక్తిగతంగా ఏమీ చెప్పకుండా తప్పించుకుంది. ఇతే ఇప్పుడు రుక్కు కూడా తన లాగే అగౌరవమైన, సిగ్గు పడే వృత్తిలో ఉంది అనే ఆలోచన రాగానే ఆమెకు రుక్కుమీద ఒక విధమైన సానుభూతి కలిగింది. ఆ రోజుల్లో గౌరవంగా విడచిన తమ ఇద్దరూ ఇప్పుడు ఒక నీచమైన పరిస్థితిలో కలుసుకోవడంతో దిక్కులేని తనకు తన వృత్తికి ఒక తోడూ, తనతో మళ్ళీ స్నేహం కలిపించుకోడానికి ఒక సదవకాశం దొరికిందని పట్టుకి బాధతోనే సంతోషమూ కలిగింది.

ఐనాకూడా " ఇప్పుడు నువ్వేం పని చేస్తున్నావ్?" అని రుక్కు అడిగిన ప్రశ్న విని పట్టు అవమానంతో తల వంచింది.

" పట్టూ, నువ్వేం బాధ పడకు. నేను నిన్ను దుఖపెట్టాలని అడగలేదు. నా వల్ల ఏమైనా సహాయం చెయ్యగలనా అని అడిగాను . . ఇదిగో . . నన్ను చూడు, " అని అంటూ టేబులికి అడ్డంగా చెయ్యిని చాటి ఆ వొంగిన మొహాన్ని అభినందిస్తూ - రుక్కు గడ్డాన్ని తాకింది. కాటిక పూసిన పట్టు కళ్ళలో నీళ్ళు నిండి లేత రెప్పలు తడిసిపోయాయి.

పట్టు తటాలున మొహం కప్పుకొని ఏడ్చింది; రుక్కుకు ఆమె సంగతి బోధపడింది. కొంత సమయంలో మొహం తుడుచుకొని పట్టు మెల్లా మాట్లాడింది: " రుక్కూ, నేను నీ దగ్గర అబద్ధం చెప్పాను; నేను ఎవరో కుటుంబంతో వచ్చానని అబద్ధం చెప్పాను. మన ఊరులో ఒక మనిషిని నమ్మి సినెమాలో చేర్దామని నేనే బోధిచెట్టు కుటుంబంతో ఏమీ చెప్పుకోకుండా వచ్చేసాను. ఆ ద్రోహానికి కావలసిందంతా ఈ ఒక సంవత్సరంలో అనుభవించేసాను. నేనేం పని చేస్తున్నానని చెప్పడానికి నాకు నాలిక రాదు; ఒక్కొక్క నిమిషమూ అక్కడనుంచి పారిపోవాలని నా మనసు చెప్తోంది . . నేను ఎక్కడకి వెళ్తాను చెప్పు! ఇది నా కర్మ . . ." అని మరేం చెప్పలేక పట్టు నిట్టూర్పు వదిలింది.



రుక్కు మౌనంగా ఏదో ఆలోచనలో పడి తనుకూడా పళ్ళెం నుంచి తినడం ఆరంభించింది. " సరే, నువ్వూ తిను . . " అని పట్టుతో చెప్పింది. ఇద్దరూ మౌనంగా టిఫను తిన్నారు.

ఉన్నపాటుగా రుక్కు మాట్లాడింది: " . . అవును . . ఇది కర్మ, ఎవరేం చెయ్యగలరు? మన కర్మ మనల్ని బీదలుగా చేసింది; మనల్ని నిరుపేదలుగా చేసింది; ఒక పూట భోజనానికీ, ఒక మంచి చీరకీ తగవులాడుతూ మనం జీవిస్తున్నాం. కర్మ వలన ఒక యువతి తుల్యమైన జీవితం గడపవచ్చు, కాని అగౌరవమైన ఏ పని చెయ్యకూడదు. ' నా కర్మ ఇది ' అనే నెపంతో ఏదీ చెయ్యకూడదు. ప్రస్తుతం నీ పేదరికానికి కారణం నీ కర్మ, కాని నీ అగౌరవమైన వృత్తికి అది కారణం కాదు!" అని రుక్కు ాటుగా, కాని మర్యాదగా చెప్పిన మాటలు విని, తన పెదిమలని కరచుకొని, తప్పు చేసానన్న తలపుతో పట్టు తల వంచింది.

రుక్కు ఇంకా చెప్పింది: " పేదరికంలోనే మనిషికి పరిశుద్ధం కావాలి; బలహీనమైన శరిరాన్ని విష క్రిములు దాడిచేసినట్లు . . మనసుకి బలం లేకపోతే అన్ని రకాల దుర్గుణాలూ వచ్చేస్తాయి. కష్టపడలేక చెడ్డ దారిలో వెళ్తే మన కష్టాలు తగ్గువైపోతాయా? అలాగ చెడిపోవడం మన దౌర్బల్యమే కదా? ఇవన్నీ ఎందుకు

చెప్తున్నానంటే ఒకప్పుడు నేనూ కూడా ఇటువంటి సమస్యలో పడ్డాను . ." అని ఏమో చెప్పబోతుంటే సర్వరు ఆమెను అడిగాడు.

" ఇక కాఫియే కదా?" అని గది తలుపుకి అవతల నిలబడి అడిగిన సర్వరుతో ' అవును ' అని ఆమె తల ఊపింది.

అదే సమయంలో పట్టు ఆలోచించింది: " 'ఒక యువతి తుల్యమైన జీవితం గడపాలి, కాని చెడిపోకూడదు ' అని ఈమె అంటోంది; కాని ఇది ఇప్పుడు ఏం పని చేస్తోంది? " అని అనుకుంటూ తన చేతిలో ఉన్న ఆ చిత్రాన్ని ఇంకొకసారి విప్పి చూసి, పెదిమలలో మెచిరు నవ్వు నవ్వడం రుక్కు గమనించింది.

ఆ చిత్రాన్ని రెప్పలార్చకుండా చూస్తూ, పట్టు, ఆవేశంతో మాట్లాడింది: " రుక్కూ, నువ్వు ఎదీ బాగా ఆలోచించి చేస్తావు; నెమ్మదిగా మెలుగుతావు; నా లాగ తొందర తొందరగా ఏమీ చెయ్యవు; ఐతే ఇప్పుడు నీ గతి కూడా ఒక అగౌరవమైన స్థితికి వచ్చేసింది కదా?" అని చెప్పి తన చూపుని - అందులో విచారమూ, తుంటరితనం కలిసి ఉన్నాయి - రుక్కు మీద వాల్చింది.

" నేను అగౌరవమైన పని చేస్తున్నానని నువ్వు చెప్తే దాని గురించి నేను విచారపడను. ఎందుకో తెలుసా? నేను కూడా ప్రారంభంలో దీన్ని గురించి అలాగే అనుకున్నాను. సామాన్యులు అలాగే చెప్తారు . . ." అని ఆమె చెప్పి ఆగగానే సర్వరు బిల్లు



తీసుకొచ్చాడు. ఆ బిల్లుని టేబులు మీద పెట్టి - వాడు వెళ్ళిన తరువాత - తను చేసే పని అగౌరవమైనది కాదు, గౌరవమైనదే - అని తన మనసులో ఉన్న దృఢమైన నమ్మకాన్ని ఎలాగ ఆమెకి అర్ధమయేటట్లు చెప్పడం - అని రుక్కు ఆలోచించింది తన ఎడం చేతితో తన రెప్పలనూ, కళ్ళనూ ముట్టుకొంది.

"రుక్కు ఏడుస్తుంది కాబోలు " అనే భయంతో పట్టు ఆమెనే చూస్తోంది. రుక్కు నవ్వుతూ మాట్లాడింది: " నువ్వు ఇందకు ముందు నీ గురించి నాతో నిజం చెప్పలేదు అని అన్నావుగా, జ్ఞాపకం ఉందా? ' అబద్దం కూడా చెప్పాను ' అని అన్నావు. కాని, నీ దగ్గర నేను ఏదీ దాచలేదు; నేను చేసే పని అగౌరవమైన పని అంటే నేను నీకు ఈ చిత్రాన్ని కూడా చూపించి ఉండను; అందులో ఉన్న యువతి నేనే అని చెప్పి ఉండను. నేను చేసేది ఒక గౌరవమైన వృత్తి . . కాని ముందు . . నాకు ఎవరో ఈ ఆలోచన ఇచ్చినప్పుడు నా దేహమంతా వొణికింది . . ఏడవాలనిపించింది. "

రుక్కు కంఠంలోనుంచి మాటలు రావటం లేదు.

కాఫీని మౌనంగా చల్లార్చి, ఒక మింగు తాగి, మళ్ళీ రుక్కు మాట్లాడింది:

" నాన్నగారు పోయిన తరువాత నేను కూడా దిక్కులేని పక్షిగా ఐపోయాను. ' మీ ఊరుకి వెళ్ళి తెలిసినవారు నలుగురింట్లో పని చేసి జీవించవచ్చుగా? ఇక్కడ నీకేం ఉంది?' అని నేను ఉన్న

ఇంటిలో చాలామంది నాకు సలహా ఇచ్చారు. నాకే తెలుసు మా ఊరిలో ఏమీ లేదని. అప్పుడే నేను ఆలోచించాను: తొందరపడి ఎనిమిదో క్లాసుతో చదువు ఎందుకు ఆపేసాను అని. అటువంటి సమయాల్లో - అనుభవం లేకుండా, తనే పని చేసుకొని జీవించాలంటే - ఒక యువతికి రహస్యంగా దొరికే పని ఇప్పుడు నువ్వు చేస్తున్న పనే . .ఒకసారి ఒక ఎగ్జిబిషన్ లో ఒక స్టాల్లో పని చెయ్యడానికి వెళ్ళాను. జీతం ఒక రోజుకి రెండు రూపాయలు అనగానే చాలా సంతోషపడ్డాను. అక్కడ నాకేం పనీ లేదు; స్టాలుకి వచ్చేవారు అడిగిన ప్రశ్నలకి నవ్వుకుంటూ జవాబు చెప్పాలి . . అంతే . .

నేను పని చేసే స్టాలు ఒక పౌడరు అమ్మే స్టాలు. నేను పనిలో చేరిన మరుసటి రోజు ఆ సేల్స్ మేనేజరు నాతో చెప్పారు: " మనం అమ్మే పౌడరూ, స్నో తక్కినవాళ్ళు ఉపగోయించాలి అని చెప్పడానికి ముందు మనమూ వాటిని వాడాలి " అని సలహా ఇచ్చారు. అందువలన నేను వాటిని వాడాను; అది చూసి నేను ఉంటున్న ఇంట్లో ఉన్నవాళ్ళు నన్ను అపార్ధం చేసుకున్నారు . . ఆ తరువాత నేను ఆ ఇంటిలోనే ఒక గదిని అద్దెకు తీసుకొని అక్కడే ఒంటరిగా నివశించాలని నిశ్చయం చేసుకున్నాను.

రెండు నెలల వరకూ అ ఎగ్జిబిషన్ లో పని చేసాను. ఆ ఎగ్జిబిషన్ మూయడానికి ముందు రోజు ఆ సేల్స్ మేనేజర్ నా



దగ్గరకు వచ్చి నా గురించి అడిగారు. వయసులో చాలా పెద్దవారు, నాకు తండ్రిలాగ ఉన్నారని నేను నా పరిస్థితిని అతనికి చెప్పాను. అతను నాకు ఒక అడ్రసు ఇచ్చి అక్కడకి వెళ్ళమన్నారు. అక్కడకి వెళ్ళి చూస్తే . . మరేం చెప్పను . . అతను చూపిన దారి ఇప్పుడు నువ్వు చేస్తున్న పనే . . నేను ఆలోచించాను . . "మరేం దారి లేదా? ఇలాంటి మార్గం తలుచుకుంటే మరేం దారి కనబడదు . . తిండి లేక చచ్చినా సరే అటువంటి బతుకు నాకు వొద్దు అని వచ్చేసాను . . " అని చెప్పి చల్లార్చిన కాఫీని తీసి గబగబ తాగింది.

"నేను ఉండే ఇంటిలో మేడమీద ఒకతను ఉండేవారు, " అని రుక్కు అనగానే ఆమె ద్వనిలో ఒక మార్పూ, మొహంలో ఒక ప్రకాశమూ, కళ్ళలో ఒక చలనమూ ఏర్పడ్డాయి.

" నేను ఆ ఇంటిలో దిక్కు తెలియక కష్టపడుతుంటే - వాళ్ళ మాటలు ముళ్ళులాగ నన్ను బాధ పెడుతుంటే - అతను నన్ను చూసిన చూపులోనే అతను నాకు సహాయపడతారు అనిపించింది. అవాళ ఆ సేల్స్ మేనేజరుని చూసి నిరాశతో ఇంటికి వస్తున్నప్పుడు అతన్ని చూసాను. నేను నమ్మినట్లే అతను నాకు సహాయం చెయ్యడానికి వచ్చారు. "మీరు ఎక్కడకి వెళ్ళి వస్తున్నారని నాకు తెలుసు . ." అని అతను అనగానే నేను " ఓ

భగవంతుడా . .నా గురించి ఇతను ఇలాగ అపార్థం చేసుకున్నారే . ." అని వచ్చే ఏడ్పుని ఆపుకోలేక పోయాను.

కాని అతను నవ్వుకుంటూ మాట్లాడారు: ' దానివలన ఏం తప్పూ లేదు . . మీకేమీ తెలియక అక్కడకి వెళ్ళి నిజం తెలిసినవెంటనే వచ్చేసారు . . ఇక మీరు మేం చెయ్యబోతున్నారు?" అని అడిగారు. నా గురించి ఇంత ఆసక్తి చూపించే మనిషిని చూసి ' మీరు చెప్పినట్లు చేస్తాను ' అని అనాలనిపించింది - కానీ ఏమీ అనకుండా ఉత్తికే నిలబడ్డాను. అతనే మాట్లాడారు: ' మిమ్మల్ని, మీ మనసుని నేను బాగా అర్థం చేసుకున్నాను. మీకు ఇది ఆశ్చర్యంగా ఉండవచ్చు. నన్ను తప్పెట్టుకోకండి. రేపు పొద్దున్న నాతో వస్తే మిమ్మల్ని ఒక గౌరవమైన ఉద్యోగంలో చేర్పగలను . .' అని అతను చెప్పగానే నా మనసు ఆహ్లాదించింది " అని చెప్పి రుక్కు ఒక పెద్ద నిట్టూర్పు వదిలింది.

మళ్ళీ సర్వరు రాగానే రుక్కు " ఏం పట్టూ, ఇంకొక కాఫీ తాగుదామా?" అని అడిగింది.

"నాకు వొద్దు," అని పట్టు అన్నవెంటనే, " కాఫీకోసం కాదు . . ఇంకా కొంచ సేపు మాట్లాడదాం . . ఈ మొదటి కాఫీ చల్లారిపోయింది కూడా . . ఒక కాఫీని ఇద్దరు పంచుకుందాం . . సరే, ఒక కాఫీ తీసుకు రండి . . " అని పట్టుని ఒప్పించి రుక్కు సర్వరుకి చెప్పింది.



" మరుసటి రోజు అతనితో ఒక చోటుకి వెళ్ళాను . . అందకుముందు నాకు తెలియదు - అతను ఒక ఆర్టిస్టు అని. ఆ జాగా ఒక పవిత్రమైన కోవిలలాగ ఉంది. ' చిత్ర, శిల్ప కలాశాల ' అని విని ఉన్నావా? అదే నేను వెళ్ళినది . .బయట వసరాలో పది పదహేను విద్యార్థులు మైనంలో బొమ్మలు చేస్తూ కనిపించారు . . లోపల ఒక హాల్లో క్లాసు అవుతోంది . . నన్ను మేడ మీదకి తీసుకొని వెళ్ళారు. అక్కడ గోడలో వేలాడే చిత్రాలు చూసి నా దేహమంతా వొణికింది . .

' ఇవన్నీ చూస్తూ ఉండండి . . ' అని చెప్పి అతను కిందకు వెళ్ళారు. నేను హాలుని బాగా తిరిగి చూసాను . . హాలు మధ్య ఒక పెద్ద వేదిక - రంగ స్థలంలాగ - కనబడింది; దానికి నాలుగు దిశలా పెద్ద దీపాలు . .ఆ వేదికని - ఇష్టం వచ్చినట్లు, చక్రంలాగ తిప్పగలం . . దాన్ని చుట్టూ అలమారాలూ, వాటిలో చిత్రకారునికి కావలసిన రంగులూ, కుంచెలూ, పెన్ సిళ్ళూ, ఇంకా ఏమేమో ఉన్నాయి. ఆ చిత్రాలన్నీ నువ్వు ఇప్పుడు చూసావే దానికంటే చాలా పెద్దవి - రంగులతోనూ, కందిబొగ్గుతోనూ చేసినవి . ఆడవారూ, మగవారూ అందరూ దిగంబరులాగే ఉన్నారు. . ఆ చిత్రాలు అసహ్యకరంగా కనిపించాయి అని అప్పుడు నాకు తోచినది భ్రమ అని ఇప్పుడే నాకు బోధపడింది. ఐతే . . ఆ

రోజు నాకేం బోధపడలేదు . ఆ చిత్రాల కింద ' రుద్రా ' అని ఒక పేరు చుసాను; అవును, అదే అతని పేరు . .

కొంచ సేపట్లో - రెండు చేతుల్లోనూ మంచు ముక్కలు తేలుతున్న కూల్ డ్రింక్స్ తో - నవ్వుకుంటూ అతను వచ్చారు. నాకు అతనిగురించి అసహ్యంగా ఏదీ తోచలేదు.

అతను నాకు ఒక గ్లాసు అందించి తన చేతిలో ఉన్నది తాగుతూ ఆ గోడలో ఉన్న చిత్రాలన్నీ గమనించారు. "వీళ్ళందరూ మీలాగ గౌరవమైన యువతులే, ' అని అన్నారు. నేనేం చెప్పలేదు. అతను చెప్పారు: " ఇది ఒక దేవాలయం లాగ. ఇక్కడ అందమే దైవం. ప్రకృతిలో మనం చూసేదంతా అందమే. ఒక అందమైన పశువు, ఎద్దు, నెమలి, జింక -వీటికి మనం చీర కట్టి చూస్తే ఎంత అసహ్యంగా ఉంటుందని కల్పన చేసుకొండి!

మానవ శరీరానికి అందమే అది తొడుక్కొన్న వస్త్రంగా మారిపోయింది! వస్త్రాలకి ప్రత్యేకంగా అందమంటూ ఒకటి ఉంది, నిజమే! దానికోసం వేరే క్లాసులుకూడా ఉన్నాయి, అక్కడ రూప కల్పన, బొమ్మలు చెక్కడం - ఇటువంటివి విద్యార్థులు నేర్చుకుంటున్నారు. మానవ శరీరానికి అందం వస్త్రాలలో లేదు .. ఇంకా చెప్పాలంటే వస్త్రాలూ, ఆబరణాలూ - ఇవే అసహ్యం! దేనినైనా చెడగొట్టితే అదేకదా అసహ్యం? ఇతే, నేను ఇలా చెప్తున్నప్పుడు మీరు ఒకటి అర్థం చేసుకోవాలి: ఈ ప్రమాణాలు



అన్నీ ఈ కళా జ్వాల ముందు; అవి ఈ పవిత్రమైన హాలు బయట చెల్లవు.

కళాకారుని హృదయం ధగధగలాడుతూ ఉంటుంది. ఇక ఈ ప్రపంచం చూస్తే దాని హృదయంలో నిత్యమూ మోసం, విద్రోహం, అబద్దాలే; ఈ తీక్షణమైన అందాన్ని ఆ కన్నులు భరించలేవు. అందువలన కపట హృదయాలకి ఈ అందాల్ని హర్షించడం చేతకాదు. ఇక్కడ అందం ఆరాధనకొసమే అవశ్యం; అక్కడ అవశ్యమని వస్తే అన్ని విధాల అవలక్షణాలూ - ' అందంగా ' మారిపోతాయి. బాగా ఆలోచించండి; నగ్నత్వం ఒక అసహ్యమా? బాగా ఆలోచించండి, మీ శరీరాన్ని, దాని అందాన్ని మీరు హర్షించలేదా - మీరు ఒంటరిగా ఉన్నప్పుడు? ఆ అభిరుచిలో ఏమైనా అసహ్యం ఉందంటారా? లేదే . . ఆ ఏకతను మీ ప్రపంచంతో ఆ కళాకారుడు అలవరచుకున్నాడు. దాని తరువాత ' నువ్వు ' , ' నేను ' అనే భేదమే లేదు. అనిత్యమైన ఒక బూటకమైన అందంలోనుంచి ఒక నిత్యమైన ప్రతిమను సృష్టించడానికే కళాకారుడు అందాన్ని పూజిస్తున్నాడు. మీ శరీరంలోని అందము ఒక శాస్వతంలేని ఒక అబద్దం; కాని అబద్ధమని తోచే ఈ చిత్రం - శాస్వతమైన - ఒక సృష్టి! మీరు దేవుని సృష్టి - కాని దేవుడు సృష్టించినది ఒక అసత్యమే. అందులోనుంచి సత్యాన్ని పెంచినది ఒక కళాకారుని చేతులు . . మనిషి సృష్టించిన కళ మాత్రం

సత్యం! ఇటువంటి ఒక ఉత్తమమైన కృషిలో నీచమైన ఆలోచనలకి చోటు లేదు. అవన్నీ అగ్ని జ్వాలలో పడిన ఎండ ఆకులలాగ మండి పోతాయి.

ఇదిగో, ఈ వేదిక మీద ఎక్కి సిలబడిన క్షణమే మీరు ప్రకృతిలో ఒక అంశంగా మారిపోతారు; అప్పుడు మీరు వస్త్రాలతో ఉండవచ్చు, లేక వివస్త్రగా ఉండవచ్చు. అదేం ముఖ్యం కాదు; ఇక్కడ అందమే ఒక వస్త్రంలాగ! కళాకారుని బాధ్యత దాని మీద ఆశ పడక ఆ అబద్దం నుంచి ఒక సత్యాన్ని సృష్టించడమే . . ఆ సమయిలో లైంగిక చింతనలు తోచవు . . మీరు ఏమీ తెలియని ఒక పసి పాపలాగ కూర్చోనా, లేక పడుకోనో ఉన్నారనుకుందాం; శిసు నగ్నంగానే ఉంటుంది; శిసు అసహ్యం కాదు. మీ రూపాన్ని సృష్టించే కళాకారులలో ఎవడైనా ఒకడు పరిపూరితమైన కళాకారుడుకా లేక నీచమైన తలపులతో ఉంటే మాత్రం? ఈ ప్రపంచంలో దేనివలన తప్పులు జరగడం లేదు? ఒక శిసువుని చూసి కూడా కొందరు వక్ర బుద్ధితో అశ్లీలమైన పనులు చెయ్యవచ్చు; కాని అది ఆ శిసువు ప్రశ్న కాదు, అది ఆ శిసువుని బాధించదు. అది ఆ వ్యక్తినే బాధిస్తుంది . . ' "

ఇలాగ అతను చాలా సంగతులు మాట్లాడారు - నేనేం అనలేదు. ఐతే వచ్చినవెంటనే తల వంచుకొని సిలబడినట్లు కాక, ఇప్పుడు



తల ఎత్తి ఆ చిత్రాలన్ని బాగా చూసాను; నా దేహం వొణకలేదు; వాటిలో ఉన్న అందం నాకు బోధపడింది.

ఆఖరికి అతను చెప్పారు: ' ఇది ఒక పని కాదు; ఇక్కడ కళకి సేవ జరుగుతోంది. అందువలనే అటువంటి మహనీయ సేవకి మిమ్మల్ని ఉపయోగించుకుందామని నా కోరిక. దీనికి మేం ఇచ్చే డబ్బు ఒక కళాకారునికి మేం ఇచ్చే సన్మానమే కాని జీతం కాదు. ఇది అర్థం చేసుకొని మీరు ఒక మాడెల్ గా ఉండవచ్చు. లేకపోతే మీకు వేరే ఉద్యోగానికి ప్రయత్నం చేద్దామనే కోరికతో ఇక్కడకి తీసుకొచ్చాను. ఇప్పుడు లేకపోయినా భవిష్యత్తులో మీరు ఈ కళను అర్థం చేసుకుంటే మాకు తప్పక సహాయం చెయ్యగలరు . ." అని అతను అనగానే నేను ఒక క్షణంకూడా ఆలశ్యం చెయ్యక " ఈ కళకి నా వల్ల సేవ చెయ్యగలనంటే దాన్ని నేను గొప్పగా భావించి ఒక మాడల్గా ఉంటాను ' అని అన్నాను."

అప్పుడు సర్వరు కాఫీ తెచ్చాడు. కాఫీని టేబులు మీద పెట్టి ముందు రాసిన బిల్లుని దిద్ది రాసి పెట్టాడు. రుక్కు మొహంలో తన పాత అనుభవాలని మాట్లాడిన ఆయాసం వలన చెమట కారుతోంది. ఆమె కాఫీని చల్లార్చి సగాన్ని పట్టుకి గ్లాసులో అందించి మిగిలినది తను డబరాలో తాగింది. పట్టు భ్రమతో, ఏమీ తోచనట్టు, అలాగే కూర్చోంది. ఆమె మనసులో తను విన్న

దృఢమైన, నిజమైన, పవిత్రమైన సంగతులు బరువుగా నొక్కడంతో ఆమెకి మాటలేం రాలేదు. రుక్కుని, తన లాగే, నీచంగా అనుమానించినందుకు పట్టు బాధ పడింది. కాని రుక్కుకి తన మీద పగ, ద్వేషం లేకపోవడం, ఆమె పెద్దతనం చూసి పట్టు ఆమెను మనసార పొగడింది. ఆమె సొంత ప్రశ్నలు ఆమెను ఇంకా పీడిస్తూనే ఉన్నాయి. ఈమెను చూసిన తరువాత తను మళ్ళీ ఆ అంధకారంలోకి వెళ్ళాలంటే తన కర్మ కోసం ఏడవాలని ఆమె వాపోయింది. ఆ ఆలోచనలు మింగడంతో ఆమె మొహమంతా ఎట్టుబడి నరాలు నిక్కపొడుచుకున్నాయి.

కాఫీ తాగూతూ రుక్కు చెప్పింది: " ఏదో పవిత్రమైన ఆలోచనతో ధైర్యంగా చెప్పానేగాని, మొదటి రోజు, పది పదహేను ఆర్టిస్టుల మధ్య, ఆ వేదిక మీద, లైట్లలో నిలబడి, నా అంగీని విప్పి పారేయాలని అనగానే నేను వణికిపోయాను. పారిపోదామా అని అనుకున్నాను; కాని అదీ చేత కాదు; కాళ్ళు జరుగుతేనా? . . అప్పుడే నాకు అతను చెప్పిన మాటలు గుర్తులోకి వచ్చాయి . .

' ఇక్కడ అందమే ఒక వస్త్రం. ఈ మహనీయ సేవలో నీచమైన తలపులకి చోటు లేదు; అవన్నీ అగ్ని జ్వాలలో పడిన ఆకులలాగ మండి పోతాయి. ఇదిగో, ఈ వేదిక మీద నిలబడిన వెంటనే మీరు ప్రకృతిలో ఒక అంశంగా మారిపోతారు.' ఆ మాటలు మనసార, పూర్తిగా స్వీకరించిన తరువాత నా దేహం వణకడం తగ్గింది.



నేను చేసే పని గురించి నాకు సిగ్గో, అవమానమో లేదు. అతను చెప్పినది నిజం. ఇది అగౌరవమైన పని కాదు; ఇది నేను కళకి చేస్తున్న సేవ!" అని చెప్పి, రుక్కు మౌనంగా, మరేం చెప్పాలో ఆలోచించింది.

ఇంత సేపూ ఏమీ చెప్పకుండా ఉన్న పట్టు గభీమని ఒక కొత్త వస్త్రాన్ని చింపుతున్నట్టు రుక్కుని ఎత్తి పొడిచింది: " అంతా పొట్ట నింపుకోడానికే కదా? . . నువ్వు కళా, సేవా అని పెద్ద మాటలు చెప్పినా కూడా ఆఖరికి నీ పొట్టే కదా నిన్ను వివస్త్రగా చేసి వాళ్ళముందు నిలబడడానికి కారణం? . . నువ్వు దాని గురించి గొప్పగా చెప్పుకోవచ్చు . . నేను కూడా అలాగే . . " అని చెప్పవలసిన మాటల్ని పట్టు మింగింది.

" అవును, నువ్వు చీకటిలో నిలబడతావు, నేను వెలుతురులో నిలబడతాను . . ఐతే రాత్రి, పగలు అనే భేదం చెప్తే సరిపోతుందా? దీనికి అది పూర్తిగా విరుద్ధం కదా? అందువలనే ఒకటి గౌరవమైనది; ఇంకొకటి అవమానకరమైనది. సరే, అంతా పొట్టకోసం అని అనుకోకు . . కళాకారుడు తిండి లేక ఆకలితో చావ వచ్చు; లేకపోతే తన కళ మూలం అతను కోటి కోటి రూపాయలు సంపాదించ వచ్చు. అది అతని ఇష్టం . . నన్నెవరూ నిర్బంధించలేదు . . మరెవరి తృప్తికోసం నేను ఆ పని

చెయ్యలేదు, చెయ్యలేను కూడా. దాన్ని ఆత్మార్థంగా నువ్వు అర్థం చేసుకోవాలి; అప్పుడే నీకు బోధపడుతుంది . .

ఇప్పుడు నేను అక్కడే పని చేస్తున్నాను. ఇప్పుడుకూడా ఒక మాడల్గా అక్కడ వెళ్ళి నిలబడంలో నాకు చాలా సంతోషం ఉంది, ఎప్పుడూ ఉంటుంది. కారులో వచ్చి మాడల్గా పని చేసేవాళ్ళు కూడా ఉన్నారు. నీకు పొట్ట నింపడం ఒక ప్రశ్న అంటే అందుకు కళ సహాయం చేస్తుంది, కాని కళాకారుడిని పొట్ట నింపడం మాత్రం కళ ఆదర్శం కాదు . . ." అని రుక్కు చెప్తూంటే పట్టు రుక్కు చేతులు పట్టుకొని, బొల బొల మని కన్నీరు కార్చుతూ, " నాకేం తెలుసు? నేను తెలియకుండా ఏమైనా చెప్పి ఉంటే నన్ను క్షమించు . ." అని బతిమాలింది. రుక్కు ఆమె చేతిని గట్టిగా పట్టి " పిచ్చిదానా . . నువ్వేం అంటున్నావ్? నీకు బాగా బోధపడాలనే నేను ఇవన్ని చెప్తున్నాను . నాకు నీ మీద ఎందుకు కోపం చెప్పు? " అని తగ్గిన స్వరంతో అడిగింది.

"నువ్వెప్పుడైనా నీ పెళ్ళి గురించి ఆలోచించావా?" అని పట్టు వాళ్ళ సంబాషణ దిశను మార్చింది. రుక్కు ఒక నిమిషం ఆలోచించి " లేదు, నేను ఇంకా అటువంటి మగవాడిని కలుసుకోలేదు . ." అని జవాబు చెప్పింది.

రుక్కు మాటలూ, ఆమే పరిస్థితి చూసి పట్టుకి ఆమెపై మర్యాద కలిగింది.



"సరే, నువ్వు నాకు తోడుగా నాతో ఉండు. నేను చేసే పని నువ్వు సరిగ్గా అర్థం చేసుకుంటే రేపే నిన్ను అక్కడకి తీసుకెళ్తాను, సరేనా?" అని రుక్కు అడిగింది.

పతిత ఐన తన ముందు మగవాడి వాసనకూడా ఎరుగని ఒక యువతి చెయ్యి చూపి అభయం ఇచ్చినప్పుడు దాన్ని పట్టు ఎలా తిరస్కరించగలదు?

** ** ** ** **

అసాధారణమైన, పవిత్రమైన, ఆ చిత్ర శిల్ప కళాశాలలో మేడలోని విశాలమైన హాలులో, భయపడుతూ, తల వొంచి, పట్టు నడిచింది.

బాగా నెరసిన జుత్తు, కళ్ళద్దాలతో, ఒక అంగీని జిబ్బా లాగ ధరించిన ఒకతను - ప్రొఫెసర్ రుద్రా - ఆమెను చిరునవ్వుతో ఆహ్వానించి హాలులోకి తీసుకెళ్ళారు. ఆ వేదిక దగ్గర తెర వెనుక గదిలో వస్త్రాలన్ని తిసేసి అక్కడ ఉన్న అంగీ వేసుకోవాలని రుక్కు ఆమెకి వివరంగా చెప్పింది.

అలాగే ఆమె తెర వెనుక మాయమవగానే - బయట ఒక గంట మోగింది.

విద్యార్థులు మెట్లెక్కి మీదకు వస్తున్నారు.

తెర వెనుక నిలుచున్న పట్టు తల ఎత్తి గోడ మీద ఉన్న కొన్ని చిత్రాలను చూసింది. ఆమెకు ఒకటే బిడియం. మొహం చూపడానికి కూడా ఆమెకు సిగ్గేస్తుంది. ఆ చిత్రాల్లో ఉన్న స్త్రీలు అందంగా ఉన్నారు, కాని తనకి అటువంటి అందమూ, హోదా లేదని ఆమే బాధపడింది. ఆమె రుక్కును తలుచుకుంది; ఆమెకు పవిత్రమైన తన శరీరం లో ఉన్న హార్షణ తనకి తన శరీరం మీద లేదే అని ఆమెకు అనావశ్యంగా మొహమాటం కలిగింది.

అప్పుడు అతను తెర తలుపుని మెల్లగా తట్టారు.

ఆమె తన బట్టలు విప్పేసి అంగిని వేసుకొనే సమయంలో వేదిక పక్కనుంచి ఆ పొడుగాటి దీపాలు వెలిగాయి; వాటిని నిలబెట్టి పనులన్నీ సాగుతున్నాయి.

"ఐయ్యో, ఇంత వెలుతురా?" అని భ్రమించిపోయి పట్టు ఆ తెర మధ్య మొహం నొక్కి ఒక కన్నుతో బయట చూసింది. ఇరవై కంటే ఎక్కువ మంది మగవారు అక్కడ కూర్చొని ఉన్నారు.

పట్టు దేహంలో ఒణకడం, మనసులో కలవరం ఎక్కువయ్యాయి. తను వాళ్ళ ఎదుట నిలబడలేను, ఆ శక్తి తనకు లేదని ఆమెకి నిశ్చితంగా తోచింది. ఆ దీపాలని అమర్చిన తరువాత అతను మళ్ళీ తలుపు తట్టారు.

ఆమె బయటకు వచ్చింది.



లోపల వెళ్ళడానికి ముందు ధరించిన అవే బట్టలతో, తల వంచుకొని ఆమె వచ్చింది.

"నన్ను క్షమించండి . . నాకు ఇది చేతకాదు . . " అనే ఆమె మాటలు ఎవరికీ అర్ధమవనట్లు గొణుకుతూ ఆ క్లాసు నుంచి బయటకు వచ్చి గబ గబ మని మెట్లు దిగుతున్నప్పుడు రుక్కును చూసింది.

" పట్టూ . .పట్టూ . . " అని పిలుస్తూ రుక్కు పరుగెత్తుకొని వచ్చింది.

" రుక్కు, నన్ను క్షమించు . . నేను వెళ్తున్నాను . . నాచేత కాదు . . వెలుతురు చాలా ఎక్కువగా ఉంది . . " అని పట్టు పరుగెత్తింది.

" ఓ, చేత కాదు అంటే పరవాలేదు . . మరి ఇప్పుడు ఎక్కడకి వెళ్తున్నావ్?"

"ఎక్కడికో వెళ్తాను . . నా నెత్తిన రాసి పెట్టినట్టు . ." అని నిరుత్సాహంగా చెప్పి రుక్కు ఏమంటుందో అనికూడా ఎదురుచూడక పట్టు ఆ కాంపవుండు దాటి వీధిలో దిగి పరుగెత్తింది.

ఆమె వెనుక వెళ్ళడానికి ముందుకు నడచిన రుక్కు వెనుక అతను - రుద్రా - వచ్చి నిలబడ్డారు.

"Please help! అక్కడ students కాచుకొని ఉన్నారు . . మీరైనా రావాలి . . " అని పిలవగానే రుక్కు మెట్లెక్కి మీదకి వెళ్ళింది.

కొంచ సేపట్లో అందాన్ని ఆరాధించే ఆ కళా సన్నిధిలో రెందు వైపులా ప్రకాశమైన కాంతి ప్రవాహంలో అందాన్నే ఒక వస్త్రంగా ధరించి అందరి ముందూ తన శరీరాన్ని చూపుతూ నిలబడింది రుక్కు.

అదే సమయం అంధకారంలో - ఆ కప్పులో తన్ను ఇంకొక మగవాడితో దాచుకోవాలనే ప్రయత్నంలో నగరంలో వేరొక మూలకి త్వరగా వెళ్తోంది పట్టు.

*********